# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

**Bullet Edition**

బుధవారం 6 నవంబరు 2024 www.prajaaswaramdaily.com 2 pm


## అల్లు అర్జున్‌కు రిలీఫ్

### నంద్యాల పోలీసులు పెట్టిన కేసును కొట్టివేసిన ఏపీ హైకోర్టు



అమరావతి, ప్రజాస్వరం: ప్రముఖ సినీనటుడు అల్లు అర్జున్‌కు ఊరట లభించింది. నంద్యాల పోలీసులు ఆయనపై నమోదు చేసిన కేసును ఏపీ హైకోర్టు కొట్టివేసింది. ఎన్నికల సమయంలో నంద్యాలలో వైకాపా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి ఇంటికి అల్లు అర్జున్ వెళ్లారు. ఆయనను చూడటానికి అధిక సంఖ్యలో ప్రజలు చేరారని, ఇది ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించడమేనని పేర్కొంటూ నంద్యాల రూరల్ డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రరావు ఈ ఏడాది మే 11న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అల్లు అర్జున్, రవిచంద్ర కిశోర్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. దీన్ని సవాల్ చేస్తూ ఇటీవల అల్లు అర్జున్ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. నంద్యాల పోలీసుల ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసింది.


# 47వ అధ్యక్షుడిగా ట్రంప్

### 270 ఎలక్టోరల్ ఓట్లు సొంతం చేసుకున్న రిపబ్లికన్ పార్టీ

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మాజీ ప్రెసిడెంట్, రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించారు. అధ్యక్ష పీఠానికి అవసరమైన 279 ఎలక్టోరల్ ఓట్లు పొందారు. స్వింగ్ స్టేట్లలోకూడా సత్తా చాటారు. 47వ అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణం చేయనున్నారు. ఆ మేరకు పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకొంటున్నారు.

**రిపబ్లికన్లు గెలుచుకున్న రాష్ట్రాలు..**

కెంటకీ, ఇండియానా, సౌత్ కరోలినా, ఫ్లోరిడా, ఒక్లహోమా, మిస్సోరి, టెక్సస్, జార్జియా, ఇడాహో, నార్త్ కరోలినా, నార్త్ డకోటా, అయోవా, సౌత్ డకోటా, లూసియానా, ఓహియో, వయోమింగ్, నెబ్రస్కా, టెనెస్సీ, అలబామా, మిసిసిపి, వెస్ట్ వర్జీనియా, అర్కన్సాస్, మోంటానా, యుటా.






### స్వర్ణయుగం రాబోతోంది : ట్రంప్

'అందరికీ ధన్యవాదాలు' అమెరికాకు మంచి రోజులు వచ్చాయని, స్వర్ణయుగం రాబోతోందని ట్రంప్ తన విజయాన్ని ఉద్దేశిస్తూ వ్యాఖ్యానించారు. అధ్యక్ష ఎన్నికల్లో ఎలక్టోరల్ ఓట్లతో పాటు పాపులర్ ఓట్లలోనూ తనకు ఎక్కువ ఓట్లు పోలయ్యాయని చెప్పారు. తన గెలుపుతో అమెరికాకు మేలు జరుగుతుందని, తన విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలని చెప్పారు.

### ట్రంప్ కు ప్రధాని మోదీ అభినందనలు

అమెరికా అధ్యక్షుడి ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ విజయం సాధించడం పట్ల ప్రధాని మోదీ.. ట్రంప్ కు ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. చారిత్రాత్మక విజయం సాధించారన్నారు. మళ్లీ మన ఇరు దేశాల బంధం బలోపేతం కావాలని అన్నారు. ఇద్దరం కలిసి పని చేద్దామన్నారు.




## నీరా కేంద్రాలు గీత కార్మికుల కోసమే

### వారి సంక్షేమానికి పెద్దపీట
### మంత్రులు దామోదర, కొండా సురేఖ
### రక్షణ కిట్ల పంపిణీ




**సంగారెడ్డి, ప్రజాస్వరం** : గీత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండ సురేఖలు తెలిపారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో గీత కార్మికులకు రక్షణ కిట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికుల సంక్షేమం కోసం రక్షణ కిట్లు పంపిణీ చేస్తున్నది. గీత కార్మికులను ఆదుకునేందుకు నీరా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. నీరా కేంద్రాలను జిల్లా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు.

ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఈ కిట్లు ఎంతో ఉపయోగపడతాయి అన్నారు. ప్రమాదంలో మరణించిన గీత కార్మికులకు ఆర్థికం సహాయం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. స్వల్ప గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి సైతం ఆర్థిక సాయం చేస్తుందన్నారు. సమావేశంలో టీజీ ఐఐసీ చైర్మన్ నిర్మల, కలెక్టర్ వల్లూరు క్రాంతి, అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి తెలంగాణలో ఒంటిపూట బడులు

### డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు
### మధ్యాహ్న భోజన తర్వాత ఇళ్లకు విద్యార్థులు

**హైదరాబాద్, ప్రజాస్వరం** : రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలలు బుధవారం నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. ప్రాథమిక పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు మాత్రమే నడుస్తాయి. రాష్ట్రంలో కుల గణన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. బుధవారం నుంచి కుల గణన ప్రారంభం కానుంది. ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్లు, హెచ్ఎంల సేవలను సర్వేకు వినియోగించుకుంటున్నారు. అందువల్ల, రాష్ట్రంలోని దాదాపు 18,241 ప్రాథమిక పాఠశాలలు సగం సమయం మాత్రమే తెరవబడతాయి. మూడు వారాల పాటు మధ్యాహ్నం నుంచి ఒంటిగంట వరకు పాఠశాలలు నడపాలని డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. మధ్యాహ్న భోజనం అనంతరం విద్యార్థులను ఇళ్లకు పంపుతున్నారు.

## ఇంటింటి సర్వే మహత్తర కార్యక్రమం

### సమస్యలుంటే ప్రతిపక్షాలు సలహాలు ఇవ్వాలి
### ప్రజల సహకారం ఉంటేనే విజయవంతం
### హైదరాబాద్ లో మంత్రి పొన్నం చేతులమీదుగా సర్వే ప్రారంభం

**హైదరాబాద్, ప్రజాస్వరం:** గ్రేటర్ పరిధిలో 27 లక్షల 76 వేల ఇండ్లలో సర్వే నిర్వహించనున్నారు. కంటోన్మెంట్ లోని మరో 50 వేల ఇండ్లలో సర్వే కొనసాగనుంది. మొత్తం 28 లక్షల 28 వేల ఇండ్లలో సమగ్ర కుటుంబ సర్వే జరగనుంది. ఒక్కో ఎన్యుమరేటర్ కు 150 ఇండ్లు కేటాయించారు. మొదటి మూడు రోజులు ఇండ్లకు స్టిక్కర్ అంటిస్తారు. డోర్ లాక్ ఉంటే మరోసారి సర్వే వివరాల సేకరిస్తారు. ఈ సర్వలో ప్రతి 10 మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్ వైజర్ ఉంటారు. ఏ రోజుకు ఆ రోజు సర్వేలో వివరాలు ఆన్ లైన్ లో ఎంట్రీ చేస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి 17 లక్షల 44 వేల ఇండ్లు ఉన్నాయని మంత్రి పొన్నం పేర్కొన్నారు. సర్వే కోసం 87,900 ఎన్యుమరెటర్లు నియామకం అయ్యారు. ఆధార్ కార్డు వివరాలు ఆప్షనల్ మాత్రమేన్నారు.

**మంత్రి చేతుల మీదుగా ప్రారంభం**



జీహెచ్ఎంసీలో హెడ్ ఆఫీసులో సమగ్ర కుటుంబ సర్వేను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్న మాట్లాడుతూ... ప్రభుత్వం ఇంటింటి సర్వే మహత్తర కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రజల సహకారం ఉంటేనే కార్యక్రమాలు విజయవంతమవుతాయని స్పష్టం చేశారు. ప్రజలు స్వచ్ఛందంగా సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. అందరి సలహాల మేరకు సర్వే ప్రశ్నలు రూపొందించామని మంత్రి పొన్నం వెల్లడించారు. ఇంటింటి సర్వేలో రాష్ట్రం రోల్ మాడల్ గా మారబోతోందని పొన్నం స్పష్టం చేశారు. సర్వే సమయంలో ఎలాంటి పత్రాలు స్వీకరించరని మంత్రి పొన్నం పేర్కొన్నారు. సర్వేను కొందరు రాజకీయం చేయాలని చూస్తున్నారని పొన్నం ఆరోపించారు. సర్వేలో ఏమైనా సమస్యలు ఉంటే ప్రతిపక్షాలు సలహాలు ఇవ్వాలని కోరారు.

### సిటీ శివారు..
## ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

రంగారెడ్డి, ప్రజాస్వరం : నందిగామ మండల కేంద్రంలోని కంసన్ హైజెనిక్ పరిశ్రమలో అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. అందరూ చూస్తుండగానే క్షణాల్లో పూర్తిగా షెడ్డు నేల మట్టం అయిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు తెలపడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. షార్ట్ సర్క్యూట్‌తోనే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు.

## ప్రిన్సిపాల్ సహా నలుగురిపై సస్పెన్షన్

### విద్యార్థి మృతి కేసు

**హైదరాబాద్, ప్రజాస్వరం:** నిర్మల్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ స్కూల్‌లో 9వ తరగతి విద్యార్థి షేక్ అయాన్ త్రోబాల్ ప్లేయర్ కావడంతో స్కూల్ గ్రౌండ్‌లో శారీరక వ్యాయామం చేస్తున్నప్పుడు ఫిట్స్ వచ్చి స్పృహతప్పి పడిపోయాడు. ఆసుపత్రికి తరలించగా అతడు చనిపోయినట్లు ప్రకటించారు. మృతుడు దిలావర్‌పూర్ మండలం లోలం గ్రామానికి చెందినవాడు. నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ ఆర్డీఓ రత్న కళ్యాణి ఆధ్వర్యంలో కమిటీతో విచారణకు ఆదేశించారు. కమిటీ విచారణ నివేదిక ఆధారంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.సంతోష్, ఉపాధ్యాయుడు టి.రమేష్, పీఈటీ పెంటన్న, హెల్త్ సూపర్‌వైజర్ సుజాతలను విధుల్లో నిర్లక్ష్యం చేశారన్న ఆరోపణలపై కలెక్టర్ సస్పెండ్ చేశారు.



### రేవంత్ ప్రతిపక్షంలో ఉండగా
### మేఘాను ఒక ఈస్ట్ ఇండియా కంపెనీ అన్నారు
### ఇప్పుడు ప్రాజెక్టులు కట్టబెడ్తున్నారు
### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## నీ వాటా ఎంత? ఢిల్లీ వాటా ఎంత?

**హైదరాబాద్, ప్రజాస్వరం: అప్పట్లో మేఘా ఇంజనీరింగ్ సంస్థను ఈస్ట్ ఇండియా కంపెనీ అని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి మాట్లాడారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా కమీషన్ల కోసమే అంటూ రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ గురించి మాట్లాడారని తెలిపారు. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కూడా మేఘా కృష్ణారెడ్డిని పొలిటికల్ మాఫియా అంటూ కామెంట్ చేశారని చెప్పారు. ఏ కంపెనీని ఈస్ట్ ఇండియా కంపెనీ అని ముఖ్యమంత్రి అన్నారో అదే కంపెనీ పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు.** మీరు వేసిన విచారణ కమిటీయే మేఘా కంపెనీని బ్లాక్ లిస్ట్ లో పెట్టాలని రిపోర్ట్ ఇచ్చింటదని అన్నారు. కానీ దొంగలు, దొంగలు కలసి ఊళ్లు పంచుకున్నట్లు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మేఘా సంస్థ కు రాష్ట్రంలోని ప్రాజెక్ట్ లను కట్టబెడుతున్నారని విమర్శించారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ కోసం రూ. 4350 కోట్ల టెండర్‌ను మేఘా సంస్థకు అప్పగించావని.. బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని చెప్పిన సంస్థకు ఎందుకు కాంట్రాక్ట్ కట్టబెట్టావని ప్రశ్నించారు. సుంకిశాల ప్రాజెక్ట్ విషయంలో మేఘా సంస్థ పై చర్యలు తీసుకొని కాంట్రాక్ట్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కూడా పెద్ద కుంభకోణమే అని దానిని కూడా రద్దు చేయాలన్నారు.

కేవలం మేఘా, పొంగులేటి కి చెందిన రాఘవ సంస్థ కు మొత్తం పనులను రెండు కేకుల మాదిరిగా ముక్కలు ఇచ్చారని అన్నారు. మేఘా సంస్థతో కుమ్మక్కై డబ్బులు దండుకునే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ రూ. 4350 కోట్లలో నీ వాటా ఎంత? ఢిల్లీ వాటా ఎంత? అని ప్రశ్నించారు. మొన్న స్కిల్ యూనివర్సిటీ కోసం రూ. 200 కోట్ల విరాళాన్ని ప్రాజెక్ట్ లు కట్టబెట్టినందుకే ఇచ్చారా? అని నిలదీశారు.